# సహవిద్య

డి. వెంకటరావు

విద్య అంటే జీవితపరిస్థితుల కనుగుణంగా జీవితపంథా ననుసరించటంలో శిక్షణ గరపడం. ఇది పురుషులకే అవసరం- అన్న అభిప్రాయం పూర్వం అన్ని సమాజాల్లోనూ గాఢంగా నాటుకుపోయింది. అంచేత విద్యాభ్యాసం పురుషులకే గరపుతూండేవారు. ప్రాచీన రాజ్యం 'స్పార్టా' (*Sparta*)లో మాత్రం స్త్రీలకి అధిక ప్రాముఖ్యం ఉండేదని ప్రాచీన గ్రంథాలవల్ల తెలుస్తోంది. స్త్రీల భౌతిక వాతావరణం గృహప్రాంగణాల్లోనే పరిమితం కావటంవల్ల, గృహకృత్య నిర్వహణకి అవసరమైన శిక్షణ తల్లులే ఇస్తూండేవారు. అరుదుగా కొన్ని కుటుంబాల్లో మాత్రం గృహాల్లోనే స్త్రీలకి గ్రంథపఠనం నేర్పటం మనకి చరిత్రలో కనిపిస్తుంది. మన చరిత్రలో గాయత్రీ, మొల్ల, జిజియాబాయిల వంటి సతీమణుల చరిత్రలు ప్రకాశమానంగా వెలుగుతున్నాయి.

ఇరవయ్యో శతాబ్దంవరకూ స్త్రీ విద్య దైన్యస్థితిలో ఉండేది. శతాబ్దాల తరబడిగా వ్యాకరణ పాఠశాలల్లోనూ, (*Grammar Schools*) విశ్వవిద్యాలయాల్లోనూ పురుషులకే ప్రవేశం ఉండేది.* ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయంలో స్త్రీలకి పరిపూర్ణ సభ్యత్వం 1920 సం॥ వరకూ లభ్యం కాలేదు. కేంబ్రిడ్జిలో 1947 లో లభించింది.* తూర్పు దేశాల్లో స్త్రీలపై నిషేధాలు ఇంకా నిశితంగా ఉండేవి. శాస్త్రాల్లో ఏం చెప్పబడి ఉన్నా - గృహకృత్య నిర్వహణ ద్వారా కుటుంబసేవ చెయ్యటం, పురుషుల విషయంలో వినయ విధేయతలతో ప్రవర్తించటం-అది నిర్ణీత విధానం (*Deliberate policy*) ద్వారా కానివ్వండి, సహజ పరిణామం (*Natural evolution*) వల్ల కానివ్వండి - ఆచారం అయింది. స్త్రీలకి పాతివ్రత్యం నిర్దేశించబడింది; కాని పురుషులకి స్త్రీలపై అధికారం ఇవ్వబడింది. మధ్యయుగంలో ఈ పరిస్థితులపై విప్లవజ్వాలల్ని కొందరు సాహసులైన సంస్కర్తలు లేవదీసినా, మతాచారాల్ని వ్యతిరేకించటం మహాపరాధంగా పరిగణించటంవల్ల, ఈ విప్లవోద్యమనాయకుల వెలుగు సాంఘిక మతాచారాల ఉక్కుశాసనానికి తట్టుకోలేకపోయింది. వీరేశలింగంపంతులుగారు తమ సంస్కరణ మొదటిరోజుల్లో అనుభవించిన కష్టాలు ఆంధ్రపాఠకులకి బాగా తెలిసినవే. సమానత్వం, సోదరత్వం, బంధుత్వం గట్టిగా ప్రచారంలోనికి వస్తూన్న ఆధునికయుగంలో స్త్రీ ఉద్యమనాయకుల ప్రయత్నాలకి ఇంత నిరోధం కలిగినప్పుడు- సాంఘిక కట్టుబాట్లని విధేయతగా అనుసరించటం, గౌరవలక్షణంగా పరిగణింపబడే మధ్యయుగంలో ఈ నాయకుల యత్నాలు ఫలించకపోవటంలో ఆశ్చర్యం ఏముంది? స్త్రీ విద్య ఇంత దైన్యస్థితిలో ఉన్న కాలంలో సహవిద్య అనేది ఆలోచించటానికైనా వీలుగానివిషయం.

పశ్చిమప్రపంచంలో 19వ శతాబ్దంలోనూ, ప్రాక్ప్రపంచంలో 20వ శతాబ్దంలోనూ, విప్లవాత్మకమైన మార్పులువచ్చాయి. స్వాతంత్ర్య, సమానత్వవాయువుల్ని స్త్రీలు పీల్చడానికి అవకాశం లభించింది. ఇప్పుడు కూడా ఫ్రాన్సు, ఈజిప్టు దేశాల్లో స్త్రీలకి వోటింగుహక్కు లేకపోయినా, బ్రిటనులో స్త్రీలు ప్రభువులసభలో (*House of Lords*) సభ్యత్వానికి అర్హులు కాకపోయినా, స్త్రీల విద్యావసరాన్ని అన్ని నాగరిక దేశాల్లోనూ గుర్తించారు. దానికి తగిన ప్రాముఖ్యతనిచ్చారు.

ఇంక స్త్రీలకి పురుషులతోబాటు సహవిద్యని గరపటమా లేక ప్రత్యేకపాఠశాలల్లో విద్యాబోధ చెయ్యటమా అన్న ప్రశ్న సహజంగా ఉద్భవించింది. ప్రాథమిక భేదాలు (*Basic Differences*) స్త్రీ పురుషుల మనస్తత్వంలోనూ, శారీరకశక్తుల్లోనూ, అభిరుచుల్లోనూ దృగ్గోచరం అవుతూండటంవల్ల పురుషులకి సరిపడే విద్య స్త్రీలకు ఎంతవరకూ అవసరం? లేక అన్ని విషయాల్లోనూ, స్త్రీవిద్య పురుషులవిద్యకి భిన్నంగా ఉండాలా అన్న ప్రశ్న ఉదయించింది. దీనికి సరియైన సమాధానం లభించినప్పుడు సహవిద్యా, ప్రత్యేకవిద్యా అన్న ప్రశ్నకి సమాధానాన్ని చెప్పగలం.

ఈ విషయాన్ని చర్చించేముందు 'సహవిద్య' అనే పదానికి అర్థాన్ని బాగా తెలుసుకోవటం అవసరం. ఒకే పాఠశాలలో, ఒకే ప్రణాళిక ననుసరిస్తూ విద్య నేర్పటం సహవిద్యగా మనదేశంలో సామాన్యులచేతనే గాకుండా, విద్యావేత్తలచే గూడా పరిగణింపబడుతోంది. ఈ అభిప్రాయం సరిగాదని కొంత ఆలోచనవల్ల తేలుతుంది. ప్రస్తుతం 'సహజీవనం' (*Co-existence*) అన్న సిద్ధాంతం పండిత, పామరుల ఆలోచనలమీద అమితమైన ప్రభావాన్ని కలిగివుంది. ఈ సిద్ధాంతానికి అర్థం, కేవలం వారూ, వీరూ తగవులు లేకుండా, ఎవరి ప్రాంతాల్లో వారు యుద్ధ ప్రాణభయాలు లేకుండా నివసించటం మాత్రమేనని ఎవరంటారు? దాని అసలు స్వరూపం- తగవులు పోట్లాటలూ లేకుండా నివసించడమే కాదు; పరస్పరం సహకరిస్తూ, సాముదాయిక జీవనంలో ప్రేమ, మైత్రి భావాలతో మెలగుతూ, ప్రత్యేక జీవిత పద్ధతుల్లోంచి ఒక నూతన మహత్తర సాముదాయిక జీవనాన్ని నిర్మించి, తదనుగుణంగా అన్ని దేశాల ప్రజలూ ప్రవర్తించి, భేదభావాల్ని నిర్మూలించి, అంతర్జాతీయ సాముదాయిక సంస్కృతీ రీతుల్ని (*Common Universal cultural patterus*) నిర్మించుకుని దానిలో భాగస్వామ్యాన్ని అనుభవిస్తూ, ఆ సంస్కృతీ హద్దుల్ని పెంచటంకోసం నిరంతరం సోదరభావంతో కృషిచేస్తున్నప్పుడే సహజీవనం యథార్థ స్వరూపాన్ని దాలుస్తుంది. అదే విధంగా 'సహవిద్య' అంటే - తరగతి గదుల్లో బాలురు ఒక వరసలోనూ, బాలికలు మరోవరసలోనూ కూర్చుంటూ పరస్పరం సంబంధం లేకుండా వీరి ప్రత్యేకజీవనాన్ని వీరూ, వారి ప్రత్యేక జీవనాన్ని వారూ గడపడం - అని అర్థం చెప్పటం - సహవిద్యకి వికృతార్థాన్ని కల్పించటం అవుతుంది.

పశ్చిమదేశాల్లో సహవిద్యకు ఈ అన్వయం కనిపించదు. బాలబాలికలు, ప్రాథమిక దశనుండి విశ్వవిద్యాలయ దశవరకూ, ఒకే కుటుంబపు సభ్యులలాగ మెలగుతూ, వినోద, విజ్ఞాన, విశ్రాంతి, వికాస కార్యక్రమాల్లో సహోదరుల్లాగ, ఆత్మీయుల్లాగ- పాల్గొంటున్నారు. దీనితోబాటు స్త్రీల అభిరుచులు గుర్తించబడి, నాట్య, గాన, గృహ నిర్వహణాది రంగాల్లో తమ పాత్ర

* ఈ గుర్తుల్లోని విషయాలకి ఆధారం: "*Oxford Junior Encyclopaedia. Oxford University press*"

లని నిర్వర్తించటంలో కృతకృత్యులవుతున్నారు. ఈ సందర్భంలో మనం సర్వసాధారణంగా వినే 'సెక్సు నైతిక పతనాన్ని' గురించి ఆలోచించటం అవసరం. పశ్చిమదేశాల్లో విశృంఖలజీవనం (*Promiscuous Sex Life*) ఉంటుందనీ, పాతివ్రత్యం చాలా తక్కువనీ, మనం తరుచూ వింటాం. ఈ నింద సత్యమైతే పై చెప్పిన సహవిద్య గర్హ్యమే. పశ్చిమ సభ్యతని నిందించటమే ముఖ్యోద్దేశముగా గల కొన్ని గ్రంథాలవల్లనూ, పాశ్చాత్య దేశాల్లో పర్యటించిన మన భారతీయుల వికృతానుభవాలవల్లనూ - ఈ అభిప్రాయం ప్రచారంలోకి వచ్చింది. పశ్చిమ దేశాల్లో అందరూ, లేక అధికసంఖ్యాకులు విశృంఖల జీవితాన్ని అనుసరిస్తూ ఉంటే, ఆ సభ్యత ఏనాడో అధోగతిపాలైపోయి, ఏ విషయంలోనూ ఇతరులకి మార్గదర్శకంగా ఉండకుండా ఎప్పుడో నాశనమై ఉండేది. స్త్రీ పురుష కాముక సంబంధమైన నైతిక జీవితం అధమంగానున్న జాతి అన్ని విషయాల్లోనూ మృగ్యంగా ఉంటుందన్న సంగతి అందరూ అంగీకరించిందే. పశ్చిమ దేశాల నుంచి దేశభక్తి, సాంఘికసేవ, స్వాతంత్ర్యవాంఛ, ఆర్థిక సాంఘిక పురోభివృద్ధి, క్రమశిక్షణ, విజ్ఞాన వినోద విషయాల్లో మనం అనుకరిస్తున్నవీ అనుకరించవలసినవీ చాలా వున్నాయని మన నాయకులు పదే పదే నొక్కి చెబుతూనే ఉన్నారు. అమెరికా ఫ్రాన్సు దేశాలే పశ్చిమసభ్యతకి ప్రాతినిధ్యం వహిస్తున్నాయనుకోవడం పొరపాటు. అమెరికాలో కూడా ఒక సంవత్సరంలో వివాహితులయిన వారిలో మూడవవంతు విడాకులు కోరతారని మనం వింటాం. కాని మూడింట రెండువంతులు, అంటే అధిక సంఖ్యాకులు విడాకులు కోరరన్న సత్యం గుర్తించం. పాతివ్రత్యం, సతీత్వం మన దేశంయొక్క మోనాపలీ గాదని చెప్పడం మాత్రమే ఈ వ్యాసకర్త ఉద్దేశ్యం. సభ్యతగల అన్ని దేశాల్లోనూ సతీత్వానికి సంఘంలో ఉన్నత స్థానాన్ని ఇస్తూనే ఉన్నారు. అదివరలో భర్తకు విడాకులిచ్చిన సింప్సన్ సతిని తమ రాణీగా బ్రిటిష్ ప్రజలు అంగీకరించడానికి ఇష్టపడలేదు. విడాకుల కోర్టులచుట్టూ తిరిగేవారికి ఏ దేశంలోనూ (అమెరికాలో కూడా) సంఘంలో గౌరవం లేదు.

సమాజంలో స్త్రీ పురుషులు సహజీవనానికి దోహదమివ్వాలంటే, 'సహవిద్య' అమలుజరగాలి. సుశిక్షితులై, కర్తవ్యతా ప్రబోధితులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సహవిద్య ద్వారా సహజీవన లక్ష్యాన్ని సాధించవచ్చు.

*ఉత్తర ఐర్లాండులోనూ, స్కాట్లండులోనూ, ఉత్తర ఇంగ్లాండులోనూ సహవిద్య ఎక్కువగా ఉంది. బోర్డింగుస్కూళ్లు మాత్రం ప్రత్యేక సంస్థలు. విశ్వవిద్యాలయాల్లో సహవిద్యనే అనుసరించారు. అమెరికాలో స్కూలు జనాభాలో 97% సహవిద్యాసంస్థల్లోనే చదువుతున్నారు. రష్యాలో సెకండరీదశలో సహవిద్యని కమ్యూనిస్టు ప్రభుత్వం స్టాలిన్ కాలంలో నిషేధించారు; ప్రాథమిక యూనివర్సిటీ దశల్లో మాత్రం అనుసరిస్తున్నారు. జపానులో 91% పైగా సహవిద్యాసంస్థలు.

మనదేశంలో సహవిద్యాసంస్థలు అధికమైనవి. కాని స్త్రీల హైస్కూళ్ళు, ట్రైనింగు స్కూళ్ళు, ట్రైనింగు కాలేజీలూ కూడా చాలా వున్నాయి పూనాలో స్త్రీలకి ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం ఉంది. మన సహవిద్యాసంస్థల్లో స్త్రీ పురుషుల మధ్య *Segregation* అమలులో ఉంది.

విద్యార్థిదశలో సహజీవనంవల్ల సమాజంలో స్త్రీ పురుషుల సహజీవనం సాధ్యపడటం గాకుండా, అనేక వ్యక్తిగతసామాజిక ప్రయోజనాలున్నాయి. బాలబాలికల్ని విడదీయటంవల్ల అస్వాభావికమైన కుతూహలం ఏర్పడి అనేక విధములయిన దుష్పరిణామాలు కలుగుతాయి. మనం బాలుర హాస్టలు గదుల్లోనూ, నోట్సుపుస్తకాల్లోనూ చూసే అసభ్యరచనలు చిత్రాలకి ఈ అస్వాభావికమైన కుతూహలమే కారణం. ఈ కుతూహలాన్ని చౌకబారు సెక్సు పుస్తకాలు, ఫిల్ములూ తృప్తిపరుస్తున్నాయి; మరోవైపు వృద్ధిచేస్తున్నాయి. సహవిద్యవల్ల ఈ కుతూహలం క్రమంగా తగ్గి అనేక మంచి ఫలితాలకి దారితీస్తుంది. స్త్రీల సమక్షంలో పురుషులు తమ తెలివితేటల్ని, వ్యక్తిత్వాన్ని, కార్యదక్షతని ప్రదర్శించటాని కుత్సుకతని చూపిస్తారు. సహవిద్యాసంస్థల్లో సమానస్థాయిలో యిద్దరూ మెలగుతారు. స్త్రీని తనతో సమానంగా గౌరవంగా చూసే దృక్పథానికి (ఇది ఇంకా ఉపన్యాసాల్లోనూ, పుస్తకాల్లోనూ మాత్రమే కనిపిస్తోంది) పునాదులు సహవిద్యవల్ల వెయ్యవచ్చు. ప్రత్యేక విద్య అసహజం. మన ఇండ్లలో స్త్రీ పురుషుల సహజీవనం సహజం. ప్రత్యేక విద్యవల్ల విద్యార్థులయొక్క, ఉపాధ్యాయులయొక్క భావాలు కుంటుపడతాయి. దృక్పథం బాగా సంకుచితం అవుతుంది. స్త్రీ పురుషులకి ఒకరి నొకరు బాగా అర్థం చేసుకునే అవకాశం లభించదు. *Self-Centredness* వల్ల దుష్ఫలితాల్ని మనస్తత్వశాస్త్రవేత్తలు నిరూపించారు.

కనక సమానత్వంతో స్త్రీ పురుషులు సంఘంలో మెలగాలన్నా, స్త్రీ పురుషుల మధ్య మనదేశంలో ప్రస్తుతం కనుపిస్తున్న వైరుధ్యం పూర్తిగా పోవాలన్నా, సహవిద్య ఎంతైనా అవసరం. మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి ప్రత్యేకవిద్యయందూ, సహవిద్యయందూ కూడా నమ్మకం ఉన్నట్లు కనిపిస్తోంది. పరస్పర వైరుధ్య విధానాలపట్ల సమాన భక్తి మాని ఈ విషయంలో స్పష్టమైన విధానాన్ని నిర్ణయించుకోవడం అవసరం. ★

* ఈ వివరాలు *Junior exford Encyclopaedia* నుంచి గ్రహించబడ్డాయి.

## కాలేజీలలో పరిస్థితులు

హైస్కూలు, కాలేజీ చదువులలో సహవిద్య అనేకచిక్కులకు దారితీయుచున్నది. ముఖ్యముగా కళాశాలలలో విద్యార్థినులపరిస్థితి చాలా శోచనీయముగానున్నది. నిర్భయముగా ప్రశ్నలకు జవాబులు చెప్పుటకుగాని, తమకు కలిగినసందేహములను లెక్చరర్‌నడిగి నివృత్తి చేసుకొనుటకుగాని యీనాటి విద్యార్థినులకు అవకాశము లేదు. ఎంతబుర్ర వంచుకుని నడిచినను కాలేజీవిద్యార్థినికి విద్యార్థులు పేర్లు పెట్టకమానరు. విద్యార్థినులు కేవలము జీవచ్ఛవములవలె కాలేజీ ఆవరణలో సంచరించుచుండుట చాలా విచారకరము.

సహవిద్యవలన పురుషులు స్త్రీలు ఒకరియెడల నొకరు ఎట్లు సంచరించవలయునో తెలియుననియు ఒకరిభావముల నొకరు అర్థము చేసికొనుటకు వీలగుననియు కొందరి యభిప్రాయము. కాని యది కేవల మపోహ యని మన కాలేజీలలో అనుభవమునుబట్టి తేలుచున్నది.

విద్యార్థినికి కాలేజీలో తన కళానైపుణ్యముకాని సంగీతముకాని ప్రదర్శించుటకు అవకాశము అసలు లేనేలేదు. ఇందుకు కేవలము విద్యార్థినులకు విద్యార్థులయెడ గల భయమే కారణము. ప్రస్తుతపరిస్థితులలో సహవిద్య విద్యార్థినుల కెంతమాత్రమును సదుపాయముగ లేదని నా అభిప్రాయము.

ఒక విద్యార్థిని, కాకినాడ.

★

శ్రీవత్స వారి
శ్రీ కాఫ్
దగ్గు, ఉబ్బసములకు దివ్యౌషధము